క్లుప్తంగా

అమ్మవారి సేవలో చిత్తూరు ఎంపీ



గంగమ్మ తీర్థ ప్రసాదాలను ఎంపీ రెడ్డెప్పకు అందజేస్తున్న చైర్మన్, ఈఓ

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మను చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప, పుంగనూరు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తమ కుటుంబ సభ్యులతో శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈఓ చంద్రమౌళి వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం తీర్థప్రసాదాలను చైర్మన్ అందజేసి వేదపండితులతో సత్కరించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అడిషనల్ పీపీగా హరినాథరెడ్డి



పుంగనూరు: పట్టణంలోని సీనియర్ న్యాయవాది ఎంఎస్.హరినాథరెడ్డిని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి హరీష్‌కుమార్‌గుప్తా శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన మూడేళ్ల పాటు స్థానిక ఏఎస్‌జె కోర్టులో విధులు నిర్వర్తిస్తారు. బాధ్యతలు స్వీకరిస్తానని హరినాథరెడ్డి చెప్పారు.

ఎస్‌ఐగా ప్రతాప్‌రెడ్డి



చౌడేపల్లి: చౌడేపల్లె ఎస్‌ఐగా ప్రతాప్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గంగవరం నుంచి బదిలీపై ఆయన ఇక్కడికొచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ రవి కుమార్ బదిలీపై మదనపల్లె వెళ్లారు. ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజలతో స్నేహపూర్వకంగా ఉంటామని, అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమరవీరులకు నివాళి



నివాళులర్పిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

పుంగనూరు: ఎస్సీ వర్గీకరణలో అశువులు బాసిన అమరవీరులకు శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో నివాళులర్పించారు. ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరసింహులు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘ నాయకులు శంకర్, రెడ్డెప్ప, ప్రభాకర్, వెంకట్రమణ, మురళిమహేష్, చెంగల్రాయప్ప, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో పూడికతీత

పుంగనూరు: వేసవిలో ఎలాంటి అంటురోగాలు ప్రబలకుండా ఉండేందుకు ముందుజాగ్రత్తగా మురుగు కాలువల్లో పూడికతీత పనులకు పూనుకున్నట్టు కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక 7వ వార్డు రాగానిపల్లె రోడ్డులో పూడికతీసి కంపోస్టుయార్డుకు తరలించారు. కమిషనర్ మాట్లాడుతూ చిన్న కాలువల్లో పూడిక తొలగించి, ప్రధాన కాలువలను శుభ్రం చేస్తామన్నారు. గంగజాతర, రంజాన్ పండుగలు ప్రారంభం కానున్న తరుణంలో ఏర్పాట్లు చేస్తామన్నారు.



రాగానిపల్లె రోడ్డులో పూడికతీస్తున్న కార్మికులు

ఈరోజు

ఎమ్మెల్యే వెంకటేగౌడ పర్యటన

వి.కోట: మండలంలోని వి.కోట మేజర్ పంచాయతీలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వెంకటేగౌడ శనివారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభోత్సవాలు చేస్తారని శుక్రవారం ఎంపీపీ యువరాజు ఓ ప్రకటనలో తెలిపారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

పీఈఎస్ 16వ స్నాతకోత్సవం

గుడుపల్లె: పీఈఎస్ మెడికల్ కళాశాల 16వ స్నాతకోత్సవం శనివారం నిర్వహించనున్నామని ఆ కళాశాల ప్రిన్సిపల్ హెచ్‌ఆర్ క్రిష్ణారావు తెలిపారు. వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన 161 మందికి వైద్యులకు, పోస్టుగ్రాడ్యుకేషన్ పూర్తి చేసిన 100 మంది వైద్యులకు పట్టాలు ప్రదానం చేయనున్నట్టు చెప్పారు. అలాగే పట్టాలతోపాటు ప్రతిభావంతులకు బంగారు పతకాలు, జ్ఞాపికలు అందజేస్తామన్నారు.

ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు

చౌడేపల్లి: ఉద్యోగ ఉపాధి అవకాశాలపై శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు ఏపీఎం సర్వోత్తమరెడ్డి తెలిపారు. పదోతరగతి నుంచి ఆపై చదువులు చదివిని 18 నుంచి 28 ఏళ్లలోపు నిరుద్యోగులు సదస్సుకు హాజరు కావచ్చన్నారు.

తప్పిదాలు లేకుండా ఓటర్ల జాబితా



ఓటర్ల దరఖాస్తులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ గ్లోరీ

- డబుల్ ఎంట్రీలు ఉంటే తొలగించండి
- జెడ్పీ సీఈఓ గ్లోరీ ఆదేశం

రొంపిచెర్ల: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని చిత్తూరు జెడ్పీ సీఈఓ గ్లోరీ ఆదేశించారు. శుక్రవారం ఆమె స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల లిస్టులో మార్పులు–చేర్పులు, తొలగింపులు, మార్పుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, బీఎల్‌ఓలు తప్పిదాలకు తావులేకుండా ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు. జాబితాలో ఎలాంటి తప్పులు గుర్తించినా దానికి బీఎల్‌ఓలే బాధ్యత వహించాల్సి వస్తుందని, వారిపై చర్యలు కూడా తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో ఎక్కడైనా ఒకచోట మాత్రమే ఓటు ఉండాలని, ఎక్కువ చోట్ల ఉన్నపక్షంలో ఒకచోట ఉంచి మిగిలిన చోట్ల తొలగించాలని ఆదేశించారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో కరెంటు, తాగునీరు, మరుగుదొడ్లు..ఇత్యాది సౌకర్యాలను కల్పించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ షేక్ మోహీద్దీన్, ఎంపీడీఓ రెడ్డెప్పచ్చారి, డీటీలు లోకేష్, రమణారెడ్డి, ఏఎస్‌ఓ రాజేశ్వరి, ఆర్‌ఐ అబ్దుల్ ఖాదర్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.



పుంగనూరు: ఓటుహక్కు వినియోగంపై మాట్లాడుతున్న అయూబ్‌ఖాన్



గంగవరం : బోరు వేయడానికి నిధుల మంజూరు ఉత్తర్వు పత్రాన్ని నాయకులకు ఇస్తున్న జెడ్పీ చైర్మన్

అభివృద్ధి పనులపై జెడ్పీ చైర్మన్ సమీక్ష

గంగవరం: ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షించారు. మేలుమాయి పంచాయతీ మర్రిమాకులపల్లెలో బోర్‌వెల్ కోసం రూ. 2.50 లక్షల మంజూరు ఉత్తర్వులను ప్రజాప్రతినిధులకు అందజేశారు. సమీక్షలో నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, చలపతిరెడ్డి, నాగేంద్రరెడ్డి, వినోద్‌రెడ్డి, ఈవోఆర్‌డి గోపాలప్రసాద్, ఎంఈఓ–2 శ్రీనివాసులు, ఏపీఓ మురగేష్ తదితరులు ఉన్నారు.

ఓటుహక్కు సద్వినియోగం చేసుకోండి

పుంగనూరు: ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని అబ్దుల్ కలామ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు అయూబ్‌ఖాన్ కోరారు. శుక్రవారం ఎంసీవీ డిగ్రీ కళాశాలలో ఓటుహక్కుపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో కొందరు ఓట్ల కోసం తాయిలాలు ఇస్తారని, ఆ ప్రలోభాలకు లొంగి ఓటును దుర్వినియోగం చేసుకోరాదన్నారు. ప్రజలకు, సమాజానికి ఉపయోగపడే వ్యక్తులకు మాత్రమే ఓటు వేసి దాని విలువను, రాజ్యాంగం ప్రసాదించిన హక్కును కాపాడాల్సిన బాధ్యత ఓటర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామకృష్ణ, సభ్యులు నాగరాజు, భద్రయ్య, శ్రీనివాస్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 26 మంది గైర్హాజరు

సదుం: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సర పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈపరీక్షకు 254 మంది హాజరు కావాల్సి ఉండగా 26 మంది గైర్హాజరయ్యారని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటనాథరెడ్డి తెలిపారు.

కొత్తపేటలో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కొత్తపేట నందవనం జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించినట్లు ప్రిన్సిపల్ తులసీరాం తెలిపారు. మొత్తం 174 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 15మంది గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: మండలంలోని మోడల్ స్కూల్‌లో శుక్రవారం ప్రారంభమైన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 271 మంది విద్యార్థులకుగాను 260 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ కార్తిక్ తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



బైరెడ్డిపల్లె: మోడల్‌స్కూల్ వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

వేకువజాము నుంచి పెన్షన్లు పంపిణీ



పుంగనూరులో పెన్షన్లు పంపిణీ చేస్తున్న చైర్మన్ అలీమ్‌బాషా

పుంగనూరు: మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో లబ్ధిదారులకు వేకువజాము నుంచి సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. శుక్రవారం చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో వలంటీర్లు, సచివాలయ కార్యదర్శులు ఈ కార్యక్రమం నిర్వహించారు. అలాగే మండలంలోని మంగళం, కంగానెల్లూరు గ్రామాలలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మండలంలోని రాంపల్లె వద్ద ఉన్న డయాలసిస్ సెంటర్‌లో పెన్షన్‌దారు సిరాజుద్దీన్‌కు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లలిత, వైఎస్సార్ సీపీ నాయకుడు మధుసూదన్‌రెడ్డి పెన్షన్ అందజేశారు. యూబీ కాంపౌండులో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, రహమత్‌నగర్, నానబాలవీధిలో జిల్లా మైనారిటీ సెల్ కార్యదర్శులు ఇంతియాజ్, మహబూబ్‌బాషా, కౌన్సిలర్లు అర్షద్‌అలీ, నరసింహులు, కిజర్‌ఖాన్, రేష్మా, రెడ్డెమ్మ, కాళిదాసు, కమలమ్మ, జయభారతి, సాజిదాబేగం, భారతి, ఆదిలక్ష్మి, పద్మావతి తమ వార్డుల్లో పంపిణీ చేశారు.



పుంగనూరులో డయాలసిస్ రోగికి పెన్షన్ ఇస్తున్న వైస్ చైర్‌పర్సన్ లలిత, మధుసూదన్‌రెడ్డి

ముమ్మరంగా పుష్పపల్లకి ఏర్పాట్లు



పట్టణంలో విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన స్వామివారి ప్రతిరూపాలు

వి.కోట: పట్టణంలోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 4న నిర్వహించనున్న పుష్పపల్లకి ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల అనంతరం వీరాంజనేయ స్వామికి పుష్పపల్లకి నిర్వహించడం ఆనవాయితీ. ఇప్పటికే పట్టణమంతా విద్యుత్ లైట్లు, స్వామివార్ల ప్రతిరూపాలు, పుష్పాలంకరణలతో ప్రత్యేక శోభను సంతరించుకుంది. పుష్పపల్లకి సేవకు ఇరుగు పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి సైతం పెద్దసంఖ్యలో భక్తులు వస్తారు. 4న సోమవారం రాత్రి వీరాంజనేయస్వామిని పుష్పపల్లకిపై కొలువుదీర్చి పట్టణ వీధుల్లో ఊరేగిస్తారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం ప్రత్యేక పూజలు ప్రారంభిస్తారు. ఊరేగింపు రాత్రి 9 గంటలకు ప్రారంభమై ఉదయం దాదాపు 5గంటల వరకు కొనసాగే ఈ కార్యక్రమంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ధర్మకర్త సుబ్రమణ్యం, సీఐ లింగప్ప చెప్పారు.

పల్స్‌పోలియో విజయవంతం చేయాలి



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

సదుం: 3న నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టరు గిరీష కోరారు. శుక్రవారం సదుంలో పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు తప్పనిసరిగా చుక్కల మందు వేయించాలని కోరారు. కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హెల్తాఫీసర్ ఉదయభాస్కర్, నీలకంఠ, శిఖామణి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

పూతలపట్టు: ప్రకృతి వ్యవసాయంతో రైతులు అధిక దిగుబడి పొందవచ్చని తిరుపతి జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు గంగాధరం అన్నారు. మండలంలోని పి.కొత్తకోట రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం రైతులకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి రసాయన మందులు ఉపయోగించడంతో భూమి, పంట దెబ్బతిని ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయన్నారు. తద్వారా రైతులకు పెట్టుబడులు పెరిగి గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. ఒక దేశీయ ఆవు నుంచి లభించే పేడ, పంచితం ద్వారా బీజామృతం, జీవామృతం, ఘన జీవామృతం, బ్రహ్మాస్త్రం, పంచగవ్యం తయారు చేస్తామన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శాంతిపురం/పుంగనూరు: శాంతిపురం మండలంలోని తుమ్మిశి వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూలు, పుంగనూరు మండలంలోని అడవినాథునికుంటలోని ఆదర్శ పాఠశాలలో 2024–2025 విద్యాసంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు లత, డాక్టర్ టీఎన్ రమ తెలిపారు. 5వ తరగతి పూర్తి చేసిన ఓసీ, బీసీలు రూ.150, ఎస్సీ, ఎస్టీలు రూ.75 చెల్లించి ఈ నెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 21న నిర్వహించే ప్రవేశ పరీక్షలో చూపిన ప్రతిభ, రిజర్వేషన్ల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు తమ స్కూళ్లలో సంప్రదించాలన్నారు.

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

బైరెడ్డిపల్లె: మండలంలోని వెంగంవారిపల్లెలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష–2 శిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరంలో 322 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు కోరారు. డాక్టర్లు ప్రవీణ్‌కుమార్, కిజియారాణి, విజయ్‌చంద్ర, వెంకటేశ్వర్లు శిబిరంలో వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ రవిచంద్ర, ఎంపీటీసీ జగదీష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంటల నమోదుపై సామాజిక తనిఖీ

పుంగనూరు: రబీ సీజన్‌లో రైతులు పండించిన పంటలపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఏడీ శివకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాలలోని 8 మండలాల్లోని 19,415 ఎకరాలలో 12,442 మంది రైతులు పంటలను పండించారని, ఈ జాబితాలను విడుదల చేశామన్నారు. దీనికి సంబంధించి 3వ తేదీ వరకు రైతు భరోసా కేంద్రాలలో సామాజిక తనిఖీ కోసం జాబితాలను ప్రదర్శిస్తామని, రైతులు జాబితాను పరిశీలించి ఏవైనా అభ్యంతరాలు ఉన్నంటే 3వ తేదీలోపు ఆర్‌బీకేలలో ఫిర్యాదు చేయాలన్నారు. వీటిని 5వ తేదీ వ్యవసాయాధికారులు తహసీల్దార్ ఆధ్వర్యంలో పరిశీలించి, ఆన్‌లైన్‌లో బయోమెట్రిక్ ద్వారా సరిచేస్తామన్నారు.

8 నుంచి శ్రీమల్లేశ్వర స్వామి ఉత్సవాలు

పుంగనూరు: పెద్దపంజాణి మండలం మాదనపల్లె సమీపంలో చింతలపల్లె వద్ద ఉన్న శ్రీమల్లేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ఈనెల 8న ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ తెలిపింది. ఉదయం స్వామివారికి అభిషేకం, శివరాత్రి జాగరణ రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శుద్ధ జలం అందించడమే లక్ష్యం

ఐరాల: గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధ జలం అందించడమే లక్ష్యమని పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్, దాతలు పై మాఘం సుగుణాకర్‌రెడ్డి, ఎంపీటీసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెంగనపల్లెలో దాతల సహాయంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం వారు ప్రారంభించారు. సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా కష్టాలోన్ని నిరుపేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని చెంగనపల్లెలో శుక్రవారం మట్టపల్లెకు చెందిన దిలీప్‌కుమార్‌కు రూ.1.40 లక్షలు, పాలకలకు చెందిన వెంకటరత్నంకు రూ.1.10 లక్షలు, పుత్రమద్దికి చెందిన వనజాక్షికి రూ.90 వేలు విలువైన సీఎంఆర్ఎఫ్(ముఖ్యమంత్రి సహాయ నిధి) చెక్కులను ఆయన అందజేశారు. గతంలో అనారోగ్యానికి గురైన ముగ్గురు పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నారని, వారు నిరుపేదలు కావడంతో ఆర్థికసాయానికి సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోగా, ఇప్పుడు నిధులు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.